క్లుప్తంగా

గాయకులకు సత్కారం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన గాయకుల కృషిని గుర్తించి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా వారిని సత్కరించారు. స్థానిక నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో మహమ్మద్ రఫీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక గాయకులు నయీమ్ తోపాటు అస్గర్ హుసేన్, హుమయూన్‌బాషా, మహబూబ్‌బాషాలు మహమ్మద్ రఫీ ఆలపించిన సినీ గీతాలను పాడి అందరినీ అలరించారు. అనంతరం పలు సంవత్సరాలుగా స్థానిక గాయకులు చేస్తున్న కృషిని అభినందిస్తూ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వారిని శాలువతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఎన్నికల బరిలో ప్రజా సోషలిస్ట్ కూటమి



మాట్లాడుతున్న బీసీ రమణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : రానున్న ఎన్నికల్లో ప్రజా సోషలిస్టు కూటమి పోటీలో ఉంటుందని కూటమి రాష్ట్ర కన్వీనర్ బీసీ రమణ తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ప్రజా సోషలిస్ట్ కూటమి రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలే అజెండాగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా సోషలిస్టు కూటమి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల బరిలో దిగుతుందన్నారు. అందులో భాగంగా కడప పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా ప్రజా సోషలిస్ట్ కూటమి రాష్ట్ర కన్వీనర్ అయిన తాను పోటీ చేస్తున్నానన్నారు. ఈ క్రమంలో ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నామని వివరించారు.

12వ పీఆర్‌సీ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ పీఆర్‌సీని అమలు చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని సీఎస్ఐ హైస్కూల్‌లో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన సంఘం కమిషన్‌ను ఏర్పాటు చేసి ఆరు నెలలైనా.. ఇంత వరకు బాధ్యతలు చేపట్టలేదన్నారు. త్వరగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, వెంటనే ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలతో చర్చించి 30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ముత్యాలప్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాషా, శ్రీనివాసులరెడ్డి, గురయ్య, సురేంద్రనాథరెడ్డి, జిల్లా కార్యదర్శులు, పలు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లె–కొత్తపేట సమీపంలో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలతో పాటు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు సౌకర్యాలను ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈవో పి.సురేష్‌కుమార్‌రెడ్డి కల్పించారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం జగనన్న



పుష్పగిరి ప్రచారంలో వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి

వల్లూరు : రాష్ట్ర ప్రజల ఆర్థిక స్వాలంబన కోసం చిత్త శుద్ధితో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి తెలిపారు. మండలంలోని ఆదినిమ్మాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని పుష్పగిరి, ఆదినిమ్మాయపల్లె, మిట్టపల్లె గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ నేతలతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను ఆరా తీశారు. పథకాలన్నీ కొనసాగాలంటే జగన్ తిరిగి సీఎం కావాల్సిన అవసరం వుందని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలను మళ్లీ గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



ప్రజా సంక్షేమ పథకాలను తెలియజేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రజా సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని, ఎటువంటి అవినీతి లేకుండా పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ఈ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 31/2వ డివిజన్ కార్పొరేటర్ అజంతుల్లా ఆధ్వర్యంలో మోచంపేట సచివాలయం పరిధిలోని పలు వీధులు, ప్రాంతాలను సందర్శించారు. మోచంపేట ఆటో స్టాండ్ వాటర్ ప్లాంట్ వద్ద నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. స్థానిక కార్పొరేటర్, నాయకులు, అధికారులతో కలిసి ఆయా వీధుల్లో ఇంటింటికీ తిరిగారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వార్డులోని అన్ని కుటుంబాలను కలుసుకోవడంతోపాటు వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో కూడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేసిన బుక్ లెట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి కుటుంబం లబ్ధి చేకూరిందని ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేయగా.. పలువురు తమ సమస్యలను అంజద్ బాషా దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కష్టాలు తెలుసుకొని వారి సంక్షేమం కోసం నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి, ఎటువంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. దేశంలో ఇన్ని రాష్ట్రాలు ఉన్నా ఇంత గొప్పగా పేదల గురించి ఆలోచించి సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. సంవత్సరంలో ప్రతి నెల క్యాలెండర్ పద్ధతిలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నూతన సచివాలయ వ్యవస్థను తీసుకుని వచ్చి వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకు చేర్చామన్నారు. గత ప్రభుత్వాలు అవ్వ తాతల గురించి ఆలోచన చేయలేదని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవ్వ తాత ముఖంలో చిరునవ్వు చూడాలని ప్రతినెల ఒకటో తేదీ ఉదయాన్నే తెల్లవారుజామునే ఇంటి తలుపుతట్టి పెన్షన్ అందజేయిస్తున్నారని తెలిపారు. అర్హత ఉండి ఇంకా ఎవరైనా సంక్షేమ పథకాలు కోల్పోయి ఉంటే.. వారి కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించి తిరిగి వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నిండు దీవెనలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, అరీఫుల్లా, త్యాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కమాల్ బాషా, కె.బాబు, ఉమేర్, నారపురెడ్డి సుబ్బారెడ్డి, జయచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అబ్దుల్ రౌఫ్, బీహెచ్ రహీం, ఎల్లారెడ్డి, పస్తం అంజి, సుంకేసుల బాదుల్లాతోపాటు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

కమలాపురం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్టీలు, కుల, మతాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్‌సీ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ సాదిక్, మాజీ జడ్పీటీసీ మస్తానయ్య, మాజీ సర్పంచ్ దేవదానం ఆధ్వర్యంలో ఆదివారం 13వ వార్డులో ఇంటింటికి తిరిగి జగనన్నకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రతి ఇంటి తలుపు తట్టి వారికి ఈ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో మాత్రమే అమలు అవుతున్నా యన్నారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. ఈ పథకాలన్నీ తిరిగి రావాలంటే జగనన్నను సీఎం చేసుకోవాలన్నారు. మీ కుటుంబానికి ప్రయోజనం కలిగి ఉంటేనే త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వారు ప్రజలను కోరారు. ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలను మళ్లీ గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో గౌస్‌మున్నా, గౌస్ మోదీన్, షావలి, జిలానీ, జెట్టి నగేష్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

16న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 16న నిరసనలు తెలుపుతున్నట్లు వామపక్ష రైతు, కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, మనోహర్ పేర్కొన్నారు. నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా.. కార్మిక, రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. ఒక వైపు పెట్రోలు, డీజిల్, గ్యాస్, ధరలను విపరీతంగా పెంచేసి, ప్రజల నెత్తిన భారాలు వేయడమే కాక.. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నిందన్నారు. అందులో భాగంగానే దేశ సంపదను అంబాని, అదాని వంటి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా దోచిపెడుతుందని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు కల్పించి.. రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికుల హక్కులను కాల రాశారని మండిపడ్డారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకే మూడు నల్ల చట్టాలు తీసుకువచ్చారని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారన్నారు. భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు బాదుల్లా, మల్లికార్జున, మద్దిలేటి సుబ్బారాయుడు, రైతు సంఘం నాయకులు యానాదయ్య, బాలచంద్రరయ్య, శంఖర్‌రెడ్డి, భద్రయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

● ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా
● సీఎం సహాయ నిధి కింద రూ.7.25 లక్షల చెక్కులు పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని, పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసా ఇస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా తెలిపారు. ఆదివారం స్థానిక ఉప ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.7.25 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో ప్రస్తుతం రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంపు చేయడం అద్భుతమని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రం ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద వాడిని ఆదుకోవడానికి ఆరోగ్యశ్రీ పథకం వర్తించని జబ్బులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పేదప్రజలకు ఆర్థిక సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కడప నగరంలో ఈ నాలుగేళ్లలో రూ.8 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయం కింద ఇంత పెద్ద మొత్తంలో పేద ప్రజలకు సహాయం అందించడం గొప్ప విషయం అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 8 మందికి పైగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చికిత్సకు దాదాపు ఒక్కొక్కరికి 30 లక్షలకు పైగా సాయం అందించడం జరిగిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీని గత పాలకుల నిర్లక్ష్యం చేశారని, వైఎస్సార్ తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి ఆరోగ్యశ్రీకి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. జబ్బు నివారణ ఖర్చు రూ.1000 దాటినా, దాదాపుగా 3400 పైగా సేవలను ఆరోగ్యశ్రీ పథకం కిందకి చేర్చారన్నారు. రాష్ట్రంలో ఐదు లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న పేద,మధ్యతరగతి ప్రజలకు దాదాపు 80 శాతం మందికి పైగా ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే ఇలాంటి ముఖ్యమంత్రి కలకాలం ఉండాలని, ప్రజలు ఆశీస్సులు అందించాలని కోరారు. తొలుత కడప నగరానికి చెందిన వరదబోయిన సుమలత, బీమచర్ల స్వాతి, ఆడవాల చంద్ర మున్నెయ్య, సయ్యద్, రెహన బీబీ, ఎస్.శ్రీనివాసులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ.7.25 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, అరీఫుల్లా, నాయకులు జయచంద్రా రెడ్డి, నారపురెడ్డి సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఉయ్యాలవాడ' వర్ధంతి సభకు సన్నాహాలు



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : రేనాటి సూర్యుడు, ప్రథమ స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177వ వర్ధంతి సభను ఈ నెల 22న కడపలో నిర్వహించాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు తీర్మానించారు. మానవత సంస్థ నాయకుడు బైరెడ్డి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భావితరాలకు స్ఫూర్తినిచ్చేందుకు త్యాగానికి, దాతృత్వానికి ప్రతీకలైన నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి కాంస్య విగ్రహాలను కడప నగరంలో ఏర్పాటు చేయాలని ఇది వరకే కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లినా.. ఆశించిన స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లి విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. రైతు బజారు, ఐటీఐ సర్కిల్, కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో ఉన్న రాజీవ్ మార్గ్ ప్రదేశాల్లో ఏదో ఒక చోట స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ధార్మికవేత్త డి.వెంకటరెడ్డి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎస్.రవిశంకర్‌రెడ్డి, రెడ్డి సేవా సమితి ఆర్గనైజింగ్ కార్యదర్శి పద్మప్రియ చంద్రారెడ్డి, లోక్‌సత్తా జిల్లా నాయకుడు దేవర శ్రీకృష్ణ, ఏపీ రెడ్డి సంఘం నాయకుడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత హక్కుల కోసం పోరాటం చేయాలి



డైరీ ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, డీహెచ్‌పీఎస్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దళితుల హక్కుల కోసం పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో డీహెచ్‌పీఎస్ 2024 రాష్ట్ర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం పోరాడటం అంటే ఎంతో సాహసోపేతమైన కార్యక్రమమని, అటువంటి డైరీని ఆవిష్కరిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆనాడు రాజ్యాంగంలో అంబేడ్కర్ దళితుల కోసం పొందుపరచిన చట్టాలను అమలు చేయవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, చట్టసభలు, పోలీసు,న్యాయ వ్యవస్థపై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత, మైనార్టీ వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాడులు పెరిగిపోయాయన్నారు. మతం ప్రాతిపదికన మెజార్టీలు సంతృప్తి చెందడానికి.. అన్నదమ్ముల్లా కలిసి ఉన్న భారత దేశ ప్రజలను విడదీస్తూ పరిపాలన సాగించడం సిగ్గుచేటు అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలుగన్న భారతదేశం కాకుండా నేడు పూర్తిగా మనువాదుల చేతులలోకి వెళ్లిందన్నారు. తద్వారా దేశంలో దళితుల పైన దాడులు, కుల వివక్షత పెరిగి పోయాయన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్, సీపీఐ జిల్లా నాయకులు కె.సి.బాదుల్లా, కానగల మునెయ్య, నగర అధ్యక్షుడు గోవిందు, తారక రామారావు, నరసింహులు, రాజశేఖర్, ఈశ్వరయ్య, జాన్, వెంకటాద్రి, బాబు, విజయ్ పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

చెన్నూరు : పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే గ్రామంలో ఉండే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రామనపల్లెలో ఆదివారం ఇంటింటికి వెళ్లి పరిసరాలపై, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీంబాషా మాట్లాడుతూ కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపులో భాగంగా ఆదివారం నాలుగవ రోజు మండలంలోని రామనపల్లెలో హెల్త్ అవేర్నెస్ ర్యాలీని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమై వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని మాస్కులను, ఐరన్ టాబ్లెట్లను పంపిణీ చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.విజయలక్ష్మిదేవి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వివిధ వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, ఆహార నియమాల గురించి గ్రామీణ ప్రజలకు వివరించారు.

మహిళా సమస్యల పరిష్కారానికి చట్టాలు



మాట్లాడుతున్న సైకాలజిస్టు పీవీ సునీత



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

కడప కల్చరల్ : మహిళల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పలు చట్టాలను రూపొందించిందని, వాటిపై అవగాహన కలిగి ఉండి స్వీయ రక్షణతోపాటు సాటి మహిళల రక్షణ కోసం కృషి చేయాలని ప్రముఖ సైకాలజిస్టు పీవీ సునీత అన్నారు. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో మహిళా సాధికారత–రక్షణ–అవగాహనపై ఆమె మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలు, మహిళా భక్తులు, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం రూపొందించిన చట్టాలు, వాటి ద్వారా మహిళా సమస్యల పరిష్కారంపై వివరించారు. ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్ గురించి కూడా సోదాహరణంగా వివరించారు. ప్రధాని మోడీ మహిళల కోసం తెచ్చిన చట్టాలపై తెలియజేశారు. అనంతరం నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మునగా శ్రీనివాస్, యాదాళ్ల రమణ, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షులు వంకదారి విజయ, మహిళా మండలి అధ్యక్షులు చెప్పరపు నాగ పుష్పాంజలి, కార్యదర్శి దశమందం వెంకట సుప్రియ, కోశాధికారి దరిశా నాగ సునీత, అవోపా జిల్లా అధ్యక్షులు ఆకుల సత్యప్రసాద్, కార్యదర్శి కృష్ణం శివ, కోశాధికారి వంకదారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బలిజలు బలోపేతం కావాలి



నూతనంగా నియమితులైన సభ్యులతో నారాయణస్వామి రాయల్

కడప రూరల్ : బలిజ వర్గీయులు సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో బలోపేతం కావాలని కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు వీపీ నారాయణస్వామిరాయల్ అన్నారు. ఆదివారం స్థానిక తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేటర్ రాయలసీమలో బలిజ వర్గీయులు దాదాపు 36 లక్షల మంది ఉన్నారని, బలిజ కులస్తులందరూ చైతన్యవంతులై అన్ని రంగాల్లో పైకి ఎదగాలన్నారు. త్వరలో ఆరు జిల్లాల బలిజ సోదరులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రేటర్ రాయలసీమ అధ్యక్షులుగా గాజులపల్లి సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శిగా అబ్బిశెట్టి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షులుగా ఎన్.సుబ్బనరసింహులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, వెంకటసుబ్బయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రిటైర్డ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాసుందరి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఒకప్పుడు కేన్సర్ బాగా ధనవంతులకే వచ్చేదనే నానుడి ఉండేదని, ఆ తర్వాత ఆ వ్యాధి మధ్య తరగతి వారికి కూడా రావడం మొదలైందని, కేన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫాతిమా కళాశాల హెచ్‌ఓడీ, రిటైర్డ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాసుందరి తెలిపారు. ఆదివారం ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేన్సర్ పురుషులు, మహిళలకు అనే తేడా లేకుండా ప్రతి ఐదుగురిలో ఒకరు తమజీవిత కాలంలో ఎదుర్కొంటున్నారన్నారు. మహిళల్లో గర్భాశయ ముఖ ద్వార కేన్సర్, రొమ్ము కేన్సర్ అధికంగా వస్తున్నాయన్నారు. పురుషుల్లో నోటి కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, అన్నవాహిక కేన్సర్ అధికంగా ఉన్నాయన్నారు. ఈ వ్యాధి వచ్చాక చికిత్స చేయించుకోవడం కంటే రాకుండా ముందుజాగ్రత్త చర్యలతోపాటు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీలో కేన్సర్‌ను చేర్చడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడడంతోపాటు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడుతున్నారన్నారు. పొగాకు, మద్యపానం మానేయాలని, పరిశుభ్రమైన ఆహారం, నీరు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు 4–5 లీటర్ల నీరు తీసుకోవడం మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయరామిరెడ్డి, డాక్టర్ రామమనోహర్ రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ హంతకులను శిక్షించాలి

కడప సెవెన్‌రోడ్స్ : విశాఖపట్టణం గ్రామీణ తహసీల్దార్ రమణయ్యను కిరాతకంగా చంపిన హంతకులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ తహసీల్దార్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మాజీ రాష్ట్ర కార్యదర్శి బీఏ వేదనాయకం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. తాము చెప్పిన పనులు చేయలేదని కక్షతో అధికారులను చంపడం అనాగరికం ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్రార్థన నిర్వహిస్తున్న విశ్వాసులు

కడప కల్చరల్ : నేటి యువత దుర్వ్యసనాల వైపు త్వరగా ఆకర్షితులవుతున్నారని, ముఖ్యంగా వారు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని దైవజనులు పాస్టర్ మహేష్, సిస్టర్ శాంతమ్మ పేర్కొన్నారు. ఆదివారం వారు న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ చర్చిలో ప్రపంచ శాంతి కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలంతా శాంతియుతంగా జీవించాలని, దైవం వారి పట్ల కృప చూపాలని కోరారు. ప్రజలు ఆధ్యాత్మికంగా ఎదుగుతూ, ఐకమత్యంగా జీవించాలని, యువత చెడు వ్యసనాలకు దూరమై కుటుంబంతోపాటు దేశ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడే సందడి



విద్యార్థుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక రాజారెడ్డి వీధికి చెందిన షర్మిల ఇంగ్లిషు మీడియం స్కూలు విద్యార్థులు తమ నృత్యాలతో అలరించారు. ఇటీవల విస్తృత ప్రచారంలో ఉన్న సినిమా పాటలతోపాటు జానపద గీతాలకు కూడా వారు హుషారు గొలిపే నృత్యాలతో ఆకట్టుకున్నారు. సందర్శకులు అడుగడుగునా ప్రోత్సహిస్తూ కరతాళ ధ్వనులు చేశారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.